క్లుప్తంగా

యాజమాన్య పద్ధతులు పాటించాలి: ఏఓ



పంటను పరిశీలిస్తున్న ఏఓ రామకృష్ణ

మద్దూరు(హుస్నాబాద్): మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలతోపాటు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ అన్నారు. మండలంలోని ధర్మారంలో గురువారం మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వల్ల కాండం కుళ్లు తెగులు, కత్తెరపురుగు తెగులు ఆశించే అవకాశం ఉంటుందన్నారు. దీని నివారణకు 0.3క్లోరాంత్రినిపోల్ మిల్లీలీటర్ల మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో అఖిల్ ఉన్నారు.

కూలిన ఇళ్ల పరిశీలన



ఇంటిని పరిశీలిస్తున్న స్వరూపరాణి

చేర్యాల(సిద్దిపేట): రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు పట్టణ పరిధిలోని 1, 11, 12వ వార్డుల్లో కూలిన ఇళ్లను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలిపోయిన ఇళ్ల వివరాలను సేకరించి ప్రభుత్వానికి పంపి వారికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె వెంట కౌన్సిలర్లు లింగం, పచ్చిమడ్ల సతీశ్, కో–ఆప్షన్ సభ్యుడు నాగేశ్వరరావు, కమిషనర్ ఎస్.నాగేందర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, వార్డు ఆఫీసర్లు, స్థానిక నాయకులున్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



పంటను పరిశీలిస్తున్న అధికారులు

చిన్నకోడూరు(సిద్దిపేట): నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంటలను గురువారం మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్, ఏఈఓలు పరిశీలించారు. చిన్నకోడూరు, అల్లీపూర్, ఇబ్రహీంనగర్, గోనెపల్లి, అనంతసాగర్ గ్రామాల్లో 90ఎకరాల్లో వరి పంట, 20ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారులు వెల్లడించారు. పంట నష్టం వివరాల నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. రైతులు ఆందోళ న చెందవద్దని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తోందని రైతులకు మనో ధైర్యం కల్పించారు.

ఇన్‌పుట్ డీలర్లకు అవగాహన



క్షేత్ర సందర్శనలో ఇన్‌పుట్ డీలర్లు

సిద్దిపేటరూరల్: ఒక యేడాది డిప్లొమా కోర్సులో భాగంగా పురుగుల మందులు, ఎరువులు అమ్మే ఇన్‌పుట్ డీలర్లకు తోర్నాల పరిశోధనా స్థానంలో గురువారం పలు పంటలు, నీటి సంరక్షణపై అవగాహన కల్పించినట్లు పరిశోధనా కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త, ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా వారికి పోషక యాజమాన్యంలోని వివిధ రకాల అంశాలపై, వరిలో విత్తనోత్పత్తి, వర్షపు నీటిని సేద్యపు కుంటలుగా మార్చడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లాలోని పలు గ్రామాల నుంచి వచ్చిన 33 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



లబ్ధిదారులతో నాగపురి

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంగౌడ్ అన్నారు. పట్టణ కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి నుండి మంజూరైన చెక్కులను గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌తో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, సిద్దిరాములు, సతీశ్, రవి పాల్గొన్నారు.

దిగుబడిపై దిగులు

- అధిక వర్షాలతో పత్తి పంటకు నష్టం
- ఆవేదనలో రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

జగదేవ్‌పూర్(గజ్వేల్): చేతికందే సమయంలో భారీ వర్షాలు పత్తి పంటకు నష్టం చేకూర్చాయి. నీరు నిలిచిపోవడంతో సాగంతా మురిగిపోయింది. దీంతో పూత రాలిపోయి, దిగుబడి రాదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని 29గ్రామాల్లో మొత్తం 15వేల ఎకరాల్లో పత్తిపంటను రైతులు సాగుచేశారు. కొంతమేర కురిసిన వర్షాలకు పత్తి పంట ఏపుగా పెరిగింది. దీంతో రైతులు ఆశలకు అవధుల్లేవు. కాని ఇటీవల అధిక వర్షాలు కురవడంతో పంటలకు తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక వర్షాలకు మండలంలోని తిగుల్, ఇటిక్యాల, మునిగడప, తిమ్మాపూర్, చాట్లపల్లి, అలిరాజ్‌పేట, రాయవరం, గొల్లపల్లి తదితర గ్రామాల్లో పత్తి పంటలన్నీ ఆరిపోతున్నాయి.

కౌలు రైతులకు కన్నీళ్లే..

పంటలకు నష్టం జరగడం వల్ల కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. మండలంలోని ఎకరానికి కౌలు పదిహేను వేల వరకు ఉంది. దీంతో కౌలు రైతులు అటు కౌలు, ఇటు పంట నష్టంతో కుదేలవుతున్నారు. మండలంలోని సుమారు వె య్యి మందికి పైగా కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పాడైన సాగును చూపుతున్న రైతులు

15ఎకరాల కౌలుకు తీసుకున్న..



ఈ యేడాది 15ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తిసాగు చేసిన.. కౌలు, పెట్టుబడికి కలిసి మొత్తం రూ.3లక్షల వరకు ఖర్చయింది. ప్రస్తుతం 15ఎకరాల పత్తి పంట మొత్తం ఆరిపోయింది. కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది.

– సాయిలు, రైతు, ఇటిక్యాల



ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

ఆదమరిస్తే అంతే..

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని బీజీ వెంకటాపూర్ నుంచి తిగుల్‌కు వెళ్లే బీటీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. బీజీ వెంకటాపూర్ ఫంక్షన్‌హాల్ వద్ద వర్షాలకు రోడ్డు కయ్యలు కోయడంతో ఏడాది క్రితం పది లక్షల నిధులతో బ్రిడ్జితో పాటు రోడ్డు కయ్యలు కోయకుండా గోడ నిర్మించారు. కానీ గోడ పక్కన మట్టి పోయకుండా వదిలేయడం వల్ల ప్రస్తుతం వర్షాలకు రోడ్డు మళ్లీ కయ్యలు కోస్తుంది. అసలే మలమలుపు ఆపై ప్రమాదకరంగా మారింది. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

చిన్నకోడూరు(సిద్దిపేట): వర్షాలకు కల్వర్టులు, రోడ్లు ధ్వంసమయ్యాయి. సికింద్లాపూర్ వద్ద కల్వర్టు వర్షానికి ధ్వంసమైంది. ఎప్పుడు కూలుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి త్వరగా కల్వర్టు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదానికి సూచిక 'ఎర్రజెండా'

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం రామవరం గ్రామ శివారులోని ఓ వైన్స్ షాప్ సమీపంలో మూలమలుపు వద్ద రోడ్డు కోతకు గురైంది. దీంతో అక్కడి స్థానికులు కోతకు గురైన రోడ్డుపై ఇలా ఎర్రజెండాలను కర్రల సహాయంతో ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే కోతకు గురైన రోడ్డును మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



సికింద్లాపూర్ వద్ద కల్వర్టు దుస్థితి



కోతకు గురైన రోడ్డు

పర్యావరణాన్ని కాపాడుకుందాం

- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: పట్టణంలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలను కాకుండా క్లాత్ ఫ్లెక్సీలను ప్రోత్సహించి, పర్యావరణాన్ని కాపాడుకుందామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజాప్రతినిధులు, పార్టీలు, ప్రజలు తెలిపే శుభాకాంక్షలు, వివిధ ప్రచారాలకు క్లాత్ ఫ్లెక్సీలనే వాడాలని సూచించారు. ప్లాస్టిక్ వాడితే చర్యలు తీసుకుంటామని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి నోటీసులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. ప్రింటింగ్ యజమానులు ఇతరులకు రెచ్చగొట్టే, ఇబ్బందికరంగా ఉండే ప్రకటనల ఫ్లెక్సీలను ముద్రించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని చెప్పారు. అంతకుముందు ఆయన 7వ వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని సూచించారు. అదేవిధంగా 25వ వార్డులో పర్యటించి సమస్యలు గురించి ఆరా తీశారు. తిరోజు తప్పనిసరి ఇంటింటికీ చెత్త సేకరణ వాహనం వెళ్లేలా చూడాలని పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు యోగి, శ్రీదేవి, మున్సిపల్ అధికారులు దేవరాజ్, వనిత, అన్వేష్, సతీష్, మాధవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆశ్రిత్ కుమార్

నియామకాలు చేపట్టాలి

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

దుబ్బాక: ప్రభుత్వం ఎప్పటిలాగానే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ ర్యాకం శ్రీరాములు డిమాండ్ చేశారు. గురువారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో దుబ్బాకలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టులో ఉన్న అంశాన్ని మందకృష్ణ వర్గీకరణ అయ్యేంత వరకు నియామకాలు ఆపాలని టీఎస్పీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేసినట్లు మాట్లాడడం సరైంది కాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని వెంటనే నియామకాలు చేపట్టాలని కోరారు. నియామకాలు ఆపితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దుబ్బాక అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కాల్వ లింగం, ఆస రాజశేఖర్, పాకనాటి రాజు తదితరులు ఉన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

గురుకుల హాస్టళ్లలో త్రిసభ్య కమిటీ తనిఖీ

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలోని సాంఘిక సంక్షేమ బాలుర ఎస్సీ గురుకుల హాస్టల్‌ను త్రిసభ్య కమిటీ అధికారులు తహసీల్దార్ దిలీప్‌నాయక్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు శ్రీధర్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. హాస్టల్‌లో సమస్యలపై ఆరా తీశారు. భోజనాన్ని రుచిగా అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు కురిసిన నేపథ్యంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండకుండా చూసుకోవాలని, విద్యార్థులు సీజనల్ వ్యాధులకు గురైతే వార్డెన్ బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నిరుపేదలకు బీఆర్‌ఎస్ భరోసా



బియ్యం అందజేస్తున్న అంజిరెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): నిరుపేదలకు బీఆర్‌ఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి అన్నారు. మిరుదొడ్డిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద మల్లవ్వ కుటుంబాన్ని గురువారం పరామర్శించి 50కిలోల బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పార్టీలకతీతంగా పేదలకు సేవ చేయడమే పార్టీ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పెద్దబాబు, మల్లయ్య, ఎల్లయ్య, మల్లేశం, తిరుపతి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వృద్ధులకు వైద్య పరీక్షలు

దుబ్బాకటౌన్: ఉచిత వైద్య శిబిరాన్ని వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నసీమా, వైద్యాధికారి డాక్టర్ మహారాజ్ అన్నారు. గురువారం రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిబిరంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశామన్నారు. భాను తేజ, వైద్య సిబ్బంది నరేష్, లింగం, విఘ్నేశ్వరి, ఎస్ఎన్ఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ మృతురాలి కుటుంబానికి పరామర్శ

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో నిరుపేద మద్దెల నర్సవ్వ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు. ఆయన వెంట భూంపల్లి మాజీ సర్పంచ్ బక్కి భాగ్యలక్ష్మి, బీఆర్ఎస్ నేత అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ స్వామి, కిష్టయ్య తదితరులు ఉన్నారు.

◆ గురుకులాల కార్యదర్శిని తొలిగించాలి

బెజ్జంకి(సిద్దిపేట): ఎస్సీ గురుకులాల కార్యదర్శిని వెంటనే తొలిగించాలని స్వేరోస్ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఉప్పులేటి బాబు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గెస్ట్, పార్ట్‌టైం ఫ్యాకల్టీని తొలిగిస్తూ సర్క్యులర్ జారీచేసి వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు.

◆ విద్యుత్‌కు అంతరాయం

హుస్నాబాద్: హుస్నాబాద్ సబ్ స్టేషన్‌లో అత్యవసర పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఏ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ ఉమ్మడి మండలాల్లో ఉదయం 9నుంచి 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాకటౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భవాని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న తెలుగు అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55శాతం పైన మార్కులు ఉండాలని, ఆసక్తిగల వారు 9వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

మట్టి గణపతుల పంపిణీ



విగ్రహాలు పంపిణీ చేస్తున్న సుజాత

చేర్యాల(సిద్దిపేట): స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా గురువారం శ్రీనిధి మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం ప్రకాశ్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం నివారించడానికి మట్టి విగ్రహాలు వాడాలన్నారు. కార్యక్రమంలో సీసీలు చంద్రమౌళి, పోచమ్మ, ఎస్‌బీఐ బ్యాంక్ అధికారులు, వీవోఏలు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రానికి చెందిన ఓ పశువుల పాకలో పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. పోలీసులు, ట్రాస్క్ ఫోర్స్ సిబ్బంది కలిసి స్థావరంపై దాడిచేసి యాదగిరి, సురేష్, సత్యనారాయణ, అఖిల్, కిట్టస్వామి, నాగరాజు, అశోక్, రమేశ్, వేణు, తిరుపతి, సంపత్, సుకుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న రూ.15100, ఐదు సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామని, తహసీల్దార్ సురేఖ ఎదుట 11మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



సిద్దిపేటరూరల్: మానసిక వ్యాధితో బాధపడుతూ ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ అపూర్వరెడ్డి కథనం ప్రకారం రాఘవాపూర్‌కు చెందిన ఘనపురం మల్లేశం కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో గత నెల 25న బావి వద్దకు వెళ్లివస్తానని ఇంట్లో వారికి చెప్పి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం అవుతున్నా ఇంటికి రాకపోవడంతో భార్య లక్ష్మి బావి వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరివేసుకుని ప్రాణాపాయ స్థితిలో ఉండడం గమనించింది. స్థానిక రైతుల సాయంతో మల్లేశంను సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుల, మతాలను రెచ్చగొడితే చర్యలు

- సీఐ శ్రీను హెచ్చరిక

మద్దూరు(హుస్నాబాద్)/జగదేవ్‌పూర్(గజ్వేల్)/దౌల్తాబాద్(దుబ్బాక): సోషల్ మీడియాలో మతాలు, కులాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టినవారిపై చర్యలు తీసుకుంటామని చేర్యాల సీఐ శ్రీను హెచ్చరించారు. గురువారం దూల్మిట్ట మండల కేంద్రంలోని పంచాయతీ ఆవరణలో పీస్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సమస్య తలెత్తినా 100కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్, ఎస్ఐ షేక్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండల కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఎంపీడీఓ యాదగిరి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రమోహన్ మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద పరిశుభ్రత ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఏఈ శివశంకర్, కార్యదర్శులు పాల్గొన్నారు. దౌల్తాబాద్‌లో ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను అందరూ ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. అనంతరం ఏఎస్ఐ సాయిలు, ఎంపీఓ గఫూర్, పంచాయతీ సెక్రటరీలు, ఎలక్ట్రిసిటీ విభాగం సబ్ ఇంజినీరు, మండపాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మద్దూరు(హుస్నాబాద్): మాట్లాడుతున్న సీఐ

శిథిలావస్థలో ఉన్న ఇళ్ల తొలగింపు

హుస్నాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 20వ వార్డులో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గురువారం మున్సిపాలిటీ అధికారులు తొలగించారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉన్న వారిని పునరావాస కేంద్రానికి తరలించారు. ప్రజలందరూ సహకరించాలని అధికారులు కోరారు. మున్సిపల్ చైర్మ పర్సన్ రజిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే మార్గదర్శులు



చేర్యాల(సిద్దిపేట): ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న చైర్ పర్సన్ స్వరూపరాణి



బెజ్జంకి(సిద్దిపేట): ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఎంపీడీఓ, ఎంఈఓ తదితరులు



మద్దూరు(హుస్నాబాద్): గురువులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అన్ని మండలాల్లోని పాఠశాలు, కళాశాలల్లోను గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. రాధాకృష్ణన్ చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



చిన్నకోడూరు(సిద్దిపేట): సర్వేపల్లి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



గజ్వేల్‌లోని కేజీబీవీలో ..



హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లిలో..



దుబ్బాకలో..